క్లుప్తంగా

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ


ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామ పంచాయతీలో 75 మందికి జగనన్న కాలనీ రిజిస్ట్రేషన్ పత్రాలను మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. భవిష్యత్‌లో ఈ పట్టాలను తమ అవసరాలకు వినియోగించుకునేలా ప్రభుత్వం శాశ్వత హక్కులు కల్పించడం జరిగిందన్నారు. ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, వీఆర్వో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


రామస్వామిని సన్మానిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

ఆమదాలవలస రూరల్: ఉద్యోగరీత్యా అంకిత భావంతో పనిచేసే వారికి సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని ఎలక్ట్రికల్ డీఈ భాస్కరరావు అన్నారు. పట్టణంలో గల ఎలక్ట్రికల్ రూరల్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ లైన్ మేన్‌లకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ లైన్‌మన్‌గా ఢిల్లీలో అవార్డు అందుకున్న అక్కులపేట పంచాయతీ లైన్‌మేన్ రామస్వామి, జిల్లాలో అవార్డులు అందుకున్న పలువురు లైన్‌మేన్‌లను ఘనంగా సత్కరించారు. డీఈ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు పరిష్కారంలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ఈ అవార్డులు దక్కడం ఎంతో సంతోషకమన్నారు. రూరల్ ఏఈ బి.రవికుమార్, లైన్‌ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, లైన్‌మేన్ కృష్ణ, గోవిందరావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నామని ఎంపీపీ ఆరంగి మురళి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. నరసన్నపేట వైఎస్సార్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారన్నారు. పార్టీ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు.

ఆమరణ నిరాహార దీక్ష భగ్నం

పాతపట్నం: మండల కేంద్రంలోని కోర్టు కూడలి వద్ద గల జీసీసీ డీపో పక్కన ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బెంతు ఒరియా, వడ్డీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు అంటూ వాబ యోగి, బైదలాపురం సింహాచలం గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆమరణ నిరాహారదీక్షను సోమవారం తెల్లజామున ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్, పోలీసులు భగ్నం చేశారు. నిరాహార దీక్ష చేస్తున్న వారికి ఆరోగ్యం క్షీణించడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. గిరిజన నాయకులు శ్రీనివాసరావు, చిన్నబాబు, రాంబాబు మాట్లాడుతూ ఆదివాసీలను అక్రమంగా పోలీసులు తీసుకువెళ్లారని, నకిలీ బెంతు ఒరియాలు శిబిరాన్ని కొనసాగిస్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

నరసన్నపేట: స్థానిక మేజరు పంచాయతీలో రానున్న వేసవి దృష్టిలో పెట్టుకుని తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని పంచాయతీ వార్డు సభ్యులు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బూరల్లి శంకర్ అధ్యక్షతన సోమవారం పంచాయతీ సమావేశం నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న సభ్యులు గుప్త, పి.కృష్ణప్రసాద్, రఘుపాత్రుని శ్రీధర్, బీఎల్ శర్మ, ఇప్పిలి నీలం రాజు తదితరులు మాట్లాడుతూ విద్యుత్ లైట్లు అన్నిచోట్ల వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్ను వసూలు ఆన్‌లైన్‌లో తీసుకోవడంతో జాప్యం జరుగుతుందని ఈఓ చిన్నారావు సభ్యులకు వివరించారు. జల్ జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయిలు ఉచితంగా వేయడం జరుగుతుందని, వీటి నిర్వహణకు నెల వారీ డబ్బులు గృహస్తులు కట్టాల్సి ఉంటుందని సర్పంచ్ అన్నారు. ఈ మేరకు పంచాయతీ తీర్మానం చేసి నిర్ణయం తీసుకోవాలని సభ్యులు కోరారు.

సాగులో మహిళల పాత్ర కీలకం

బూర్జ: వ్యవసాయ రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్ అన్నారు. పెద్దపేట ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు ఆధ్వర్యంలో బూర్జ మండలం గోపిదేవిపేటలో ఏర్పాటు చేసిన మన్యం సహజ ఉత్పత్తి దారుల కంపెనీ కలెక్షన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మహిళలు ఎక్కడ అభివృద్ధికి కృషి చేస్తారో అక్కడ అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లా అభివృద్ధి మేనేజరు (నాబార్డు మేనేజరు) కుప్పిలి వరప్రసాద్ మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా రైతులు పండించుకున్న పంటలు నిల్వ ఉంచుకొని అధిక ధరలు వచ్చినప్పుడు మార్కెటింగ్ చేసుకోవచ్చని చెప్పారు. ఆమదాలవలస కేవీకే శాస్త్ర వేత్త డాక్టర్ నీలవేణి, అనూష, మండల వ్యవసాయశాఖాధికారి వి.రాజేశ్వరరావు, మన్యం ఉత్పత్తుల కంపెనీ సీఈఓ బి.శంకరరావు పాల్గొన్నారు.


శ్రీముఖలింగంలో చక్రతీర్థ స్నానాలకు లక్షలాదిగా వచ్చిన జనసందోహం

వంశధార తీరం.. భక్తజన సంద్రం..


పాతపట్నం: మహేంద్రతనయ నదిలో నీలకంఠేశ్వరునికి చక్రతీర్థ స్నానాలు చేస్తున్న భక్తులు


ఎల్.ఎన్.పేట: వంశధార నదిలో పుణ్య స్నానాలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


జలుమూరు: చక్రతీర్థ స్నానాలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీముఖలింగేశ్వరస్వామి చక్రతీర్థ స్నానాలు సందర్భంగా సోమవారం వంశధార నదీ తీరంలో భక్తులు, యాత్రికులు సందడి చేశారు. యువకుల కేరింతలు.. భక్తులు భక్తి భావాలు.. స్వర్గస్తులైన పెద్దలను జంగాలతో పొగిడించే కుటుంబ సభ్యులు.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల పహారా కాశారు. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చి నదీ తీరంలో చేసుకున్న వంట వార్పులు, భోజనాలతో వంశధార తీరం.. సంద్రంగా మారిన దారులు... నదీ తీరంలో ఇసుకతో శివలింగాన్ని తయారు చేసిన భక్తులు పూజలు నిర్వహించారు.. ఇలా రకరకాల సమ్మేళనాలతో వంశధార తీరం సందడిగా తయారైంది. ఉదయం 9 గంటలకే నదిలోకి చేరుకున్న భక్తులు చక్రతీర్థ స్నానాలు కోసం సుమారు 12:30 గంటల వరకు వేచిఉన్నారు. శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ (త్రిశూల) పుణ్య స్నానాల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. సారవకోట మండల కేంద్రంలోని మండలాధీశ్వర స్వామి, అంగూరులోని కుంభేశ్వర స్వామి ఆలయాల్లో చక్రతీర్థ స్నానాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామ ఉమా కామేశ్వర స్వామివారి చక్రతీర్థ స్నానాలు వంశధారనదిలో నిర్వహించారు. పాతపట్నం మండల కేంద్రం సమీపంలోని మహేంద్రతనయ నది ఒడ్డున నీలకంఠేశ్వర, కేధారీశ్వర స్వాముల చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. పాతపట్నం పరిసర గ్రామాలతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హిరమండలంలోని చిన్నకోరాడలో గల స్వయంభూ ఉమారుద్రకోటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను వంశధార నదిలో వైభవంగా చక్రతీర్థస్నానాలు నిర్వహించారు. బూర్జ మండలంలోని బూర్జ, అల్లెన, లక్కుపురం, లాభాం, గుత్తావల్లి నాగావళి నదీతీర గ్రామాల్లో చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. కొత్తూరు మండలంలోని కుంటిభద్ర వద్ద వంశధార నదిలో శివుని ఉత్సవ విగ్రహానికి చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


నదీ తీరంలో ఇసుక శివలింగాన్ని తయారుచేసి పూజిస్తున్న మహిళ


సరుబుజ్జిలి: స్వామివారికి చక్రతీర్థస్నానాలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు


పెద్దలకు గుర్తుచేసుకుని జంగమయ్యలకు దానాలు


వంశధార నదిలో స్నానాలు చేస్తున్న మహిళలు


బూర్జ: అల్లెన సమీపంలోని నాగావళి నదిలో చక్రతీర్థ స్నానాలు చేస్తున్న భక్తులు


సారవకోట: సారవకోటలో చక్రతీర్థ స్నానాల అనంతరం ఉత్సవ విగ్రహాలను తీసుకువస్తున్న భక్తులు


హిరమండలం: స్వామివారి ఉత్సవ మూర్తులను చక్రతీర్థ స్నానాలకు వంశధార నదిలోకి ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు


కొత్తూరు: కుటుంభద్రలో శివుని ఉత్సవ విగ్రహానికి చక్రతీర్థ స్నానం చేసి తీసుకువస్తున్న భక్తులు


పిరమిడ్ ఆకారంలో యువకుల విన్యాసం

సచివాలయాలతో గ్రామస్వరాజ్యం


కొరపాంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

● స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో చీమలవలసలో రూ. 26.50 లక్షలతో నిర్మించిన గ్రామీణ పశువైద్యశాల, నెల్లిపర్తిలో రూ. 41 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, కొరపాంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయం, రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పరిపాలన తీసుకువచ్చామన్నారు. గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాయమాటలు చెప్పడానికి టీడీపీ నాయకులు వస్తారని, వారి అబద్ధపు హామీలు నమ్మవద్దన్నారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ తిర్లంగి రామారావు, ఎంపీటీసీ కూటికుప్పల ఉషారాణి, సర్పంచ్‌లు మానుకొండ రాజేశ్వరి, చిలకలపల్లి సురేష్, చిగురుపల్లి దశరథ, మెట్ట ఆనందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చేపాన కృష్ణ, గురుగుబెల్లి నీలారావు, బొడ్డేపల్లి నిరంజన్, తాంద్ర ధనుంజయరావు, బెండి జయరాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో బస్టాండ్ అభివృద్ధి


బస్టాండ్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న బస్టాండ్‌లో రూ.25 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ప్రారంభించారు. బస్‌స్టాండ్‌లో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనకాపల్లికి చెందిన ఓ స్వచ్ఛంద సేవా సంస్థ అప్పగించారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, సర్పంచ్ శిర్ల వేణుకుమారి, వైస్ సర్పంచ్ మమత, ఏఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు కె.అర్జునుడు, ఎం.తాతయ్యలు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్ ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, ఎస్ఎంఎస్‌యూ డైరెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

90 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ఆమదాలవలస రూరల్: అయోడైజ్డ్ ఉప్పును ఆహారపదార్థాల ద్వారా తీసుకోవాలని అక్కులపేట పీహెచ్‌సీ వైద్యురాలు కె.మీనా కుమారి అన్నారు. మండలంలో అక్కులపేటలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులకు థైరాయిడ్ పరీక్షలను సోమవారం నిర్వహించారు. నాన్ అయోడైజ్డ్ ఉప్పును తీసుకోవడం వల్ల హైపర్ థైరాయిడ్, హైపో థైరాయిడ్ రుగ్మతలు వస్తాయన్నారు. శరీరంలో అలసట, ఆందోళన, నిద్రలేమి, జుట్టురాలటం, అధిక చెమట, చలిని తట్టుకోలేకపోవడం, అతి ఆకలి, బరువు తగ్గడం వంటి లక్షణాలు థైరాయిడ్ లక్షణాలన్నారు. వీటి నివారణకు అయోడైజ్డ్ ఉప్పును తీసుకోవాలన్నారు. వైద్యులు బి.వసంత, హెల్త్ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

పోలాకి: మండలంలోని అంపలాం సచివాలయం పరిధిలో గల రైతు భరోసా కేంద్రాన్ని జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రీజనల్ కో-ఆర్డినేటర్ ధర్మాన కృష్ణచైతన్య సోమవారం ప్రారంభించారు. రైతులకు అన్ని రకాలుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో రైతులందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, వ్యవసాయశాఖ అధికారి చిరంజీవి, పార్టీ నాయకులు కె.లక్ష్మణరావు, రామారావు, పోలిదాసు తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

పొందూరు: స్థానిక పంచాయతీ పరిధిలో సోమవారం నిర్వహించిన వేలంపాట వాయిదా వేశామని ఈఓపీఆర్డీ సింహాచలం, ఈఓ ఎస్.రమేష్ తెలిపారు. సర్పంచ్ రేగిడి లక్ష్మి ఆధ్వర్యంలో మార్కెట్, కబేలా, కారు పార్కింగ్ వేలంపాట నిర్వహించారు. ప్రభుత్వం పాటకు అనుగుణంగా టెండర్లు రాకపోవడంతో వాయిదా వేసినట్లు చెప్పారు. ముఖ్యంగా పంచాయతీకి ఆదాయం తెచ్చిపెట్టే మార్కెట్ ఆశీల పాటను రూ.8.60 లక్షలుగా సూచించగా కేవలం రూ.8 లక్షలకు మాత్రమే టెండర్ వేశారు. మరలా వేలంపాట తేదీలను ప్రకటిస్తామని ఈఓ చెప్పారు.

పశుసంవర్ధక శాఖ ఏడీగా దేవలక్ష్మి

సారవకోట: మండల పశు సంవర్ధకశాఖ ఏడీగా దేవలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె బాపట్లలో పశు సంవర్ధకశాఖ వైద్యురాలిగా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏడీ వి.జయరాజ్ టెక్కలి జేడీగా బాధ్యతలు నిర్వర్తిస్తుండటంతో.. కోటబొమ్మాళి ఏడీ లోకనాథం ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తించేవారు.

సిరుసువాడ–కుంటిభద్ర రోడ్డుకు మహర్దశ

కొత్తూరు: మండలంలోని సిరుసువాడ–కుంటిభద్ర రోడ్డుకు మహర్దశ పట్టింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రోడ్డు ఏఎంసీ నిధుల నుంచి రూ.198.47 లక్షల నిధులు మంజూరు చేశారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి రహదారి పనులను మంగళవారం ప్రారంభించనున్నారు.

53 మందికి కంటి పరీక్షలు

కొత్తూరు: స్థానిక వెంకటేశ్వర ఆలయం ఆవరణలో నేత్ర వైద్య శిబిరాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. 53 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 27 మందికి అంతర కుసుములు ఉన్నట్లు కొత్తూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య గుర్తించారు. కంటి ఆపరేషన్లు చేసేందుకు సోంపేట ఆరోగ్యవరం కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనం ద్వారా తరలించారు. కొత్తూరు, హిరమండలం మండలాలకు చెందిన రోగులు హాజరైనట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ తెలిపారు.

రెవెన్యూ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం

పొందూరు: మండలంలో రెవెన్యూ సిబ్బంది ప్రజాప్రయోజనాల పనుల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే మ్యుటేషన్లు జరగటం లేదని, పిల్లలవలస, ధర్మపురం, దళ్లవలస గ్రామాల్లో భూసర్వే నిలిచిపోయిందన్నారు. తహశీల్దార్‌ను అడుగుతుంటే ఎన్నికల విధుల్లో ఉన్నామని సమాధానం ఇస్తున్నారన్నారు. పలు శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగానే కింతలి నుంచి లైదాం వరకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పిచ్చి మొక్కల తొలగింపు వంటి పనులపై చర్చించారు. జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, ఎంపీడీఓ సూర్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం..

నరసన్నపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీపీ ఆరంగి మురళి కోరారు. చెన్నాపురంలో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గ్రామాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రచారం తదితర అంశాలపై సూచనలు చేశారు. పార్టీ నాయకులు చింతు రామారావు, పొన్నాన దాలినాయుడు, ఉలకాపు రవి, బార్ల వేణుగోపాలరావు, కొంక్యాన నర్సింహమూర్తి, సురంగి నర్సింగరావు, రాజాపు అప్పన్న, బగ్గు రమణయ్య పాల్గొన్నారు.